నిత్య జనగణమనకు రెండేళ్లు

- పెరుగుతున్న దేశభక్తి భావం
- ఉత్సాహంగా పాల్గొంటున్న ప్రజలు

పెగడపల్లి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నిత్య జనగణమన విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమం ప్రారంభించి నేటికి రెండేళ్లు అవుతోంది. ప్రతి రోజూ క్రమం తప్పకుండా ఉదయం 9 గంటలకు జాతీయ గీతాన్ని ఆలపిస్తున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిత్య జనగణమన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు ఏడాదికి రెండుసార్లు పాడే జాతీయ గీతాన్ని ప్రతినిత్యం ఉదయం 9 గంటలకు ఆలపించే అవకాశం కలిగింది. శ్రీరాజరాజేశ్వర ఆలయం కమిటీ ఆధ్వర్యంలో దాతల సాయంతో నిత్య జనగణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలో 2022 ఏప్రిల్ 10న నిత్య జనగణమన కార్యక్రమం ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకు జాతీయ గీతాలాపనలో ప్రజలు పాల్గొంటున్నారు. జాతీయ గీతం ప్రారంభించే సమయానికి దుకాణదారులు, వాహనదారులు, విద్యార్థులు, రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు ఎక్కడి వారక్కడే నిలబడి జాతీయగీతాన్ని ఆలపిస్తున్నారు.


పెగడపల్లిలో నిత్య జనగణమనకు హాజరైన ప్రజలు

క్రమం తప్పకుండా..



రెండేళ్లుగా క్రమం తప్పకుండా నిత్య జనగణమన కార్యక్రమంలో పాల్గొంటున్న. ఉదయం పూట జాతీయ గీతాలపన చేయడంతో మంచి అనుభూతిని కలుగుతుంది. ఉదయం ఎన్ని పనులున్నా నిత్య జనగణమన కార్యక్రమంలో పాల్గొంటున్నాం.

– కొలిపాక సురేశ్, మెడికల్ షాపు నిర్వాహకుడు

దేశభక్తి పెరిగింది



పెగడపల్లిలో నిత్య జనగణమన ఏర్పాటు చేసి జాతీయ గీతం పాడుతుండటంతో ప్రజల్లో దేశభక్తి పెరిగింది. కార్యక్రమం ఏర్పాటు నుంచి క్రమం తప్పకుండా హాజరవుతున్నా. నిత్య జనగణమన ఏర్పాటు చేసి ప్రజల్లో దేశభక్తిభావం పెంపొందించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– జీరెడ్డి జగదీశ్‌రెడ్డి, పెగడపల్లి

స్ఫూర్తిదాయకం



పెగడపల్లిలో ఏర్పాటు చేసిన నిత్య జనగణమన ప్రజలకు ఎంతో స్ఫూర్తి దాయకంగా నిలుస్తోంది. నిత్య జనగణమన ద్వారా జాతీయ తాస్ఫూర్తిని విస్తరింపజేస్తున్న వారికి అభినందనలు. సామాన్యుడిగా నేను కూడా ప్రతినిత్యం కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది.

– మూల వెంకట్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్సై

ఘనంగా వీరభద్రస్వామి జాతర


సాతారం శ్రీవీరభద్రస్వామి ఆలయంలో హోమం


చిల్వకోడూర్‌లో స్వామివారి రథోత్సవం

మల్లాపూర్: మండలంలోని సాతారంలో శ్రీ వీరభద్ర స్వామి జాతర మహోత్సవాలను బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే రెండో వీరభద్ర స్వామి దేవస్థానంగా గుర్తింపుపొందిన సాతారం వీరభద్రస్వామి జాతర ఉత్సవాలకు మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు అన్నిగ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ ఉత్సవాల్లో యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేశ్, ఎంపీటీసీ గుర్రాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బొడ్డు సుమలత, గ్రామాభివృద్ధి కమిటీ బృందం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆలయ అర్చకులు కందలై విద్యాదారచార్యులు వీరభద్రస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతర మహోత్సవానికి మండలంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి శ్రీ వీరభద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా శ్రీలక్ష్మి నృసింహస్వామి రథోత్సవం

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో శ్రీలక్ష్మీనృసింహస్వామి రథోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథోత్సవం అనంతరం స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో ఆలయకమిటీ చైర్మన్ పాల్తెపు గంగారాం, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

గొల్లపల్లి: మండలంలోని చిల్వాకోడూర్ శ్రీ రామలింగేశ్వర స్వామి ఉగాది పర్వదిన జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు రథాన్ని ఉత్తర రాజగోపురం ముందుకు తీసుకువచ్చి శ్రీ రామలింగేశ్వర స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు.అనంతరం ఆలయకమిటీ చైర్మన్ దాసరి తిరుపతి, భక్తులు కొబ్బరి కాయకొట్టి రథాన్ని ప్రారంభించారు.పెద్ద సంఖ్యలో భక్తులు వెంటరాగా, ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేసి, గ్రామ పురవీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా విమల రణదివే పోరాటం


నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

జగిత్యాల: దోపిడీకి వ్యతిరేకంగా పోరాటంచేసి తన జీవితమంతా దారపోసిన వ్యక్తి సీఐటీయూ వ్యవస్థాపక కన్వీనర్ విమల రణదివే అని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన అన్నారు. కార్యాలయంలో విమల రణదివే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సంఘాల మధ్య సంఘీభావం పెంచి కమ్యూనిస్ట్ అయ్యారని, రైతులు, కార్మికుల కోసం ఎంతో పోరాటం చేసిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, రమేశ్, వెంకటచారి, సులేమాన్, రఫీక్, అబ్దుల్లా, సరోజన పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనం


మల్లాపూర్ మండలంలో ట్రాక్టర్‌తో దున్నిస్తున్న రైతు

మల్లాపూర్: యాసంగి పంట కాలం పూర్తయితే మెట్ట భూములన్నీ ఖాళీగా ఉంటాయి. ఆ భూములను అలా వదిలేయడం కంటే దుక్కులు దున్నడం, భూసారం పెంపునకు పచ్చిరొట్ట పెంచడం వంటివి చేస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఇన్‌చార్జి ఏడీఏ లావణ్య సూచిస్తున్నారు.

దున్నిస్తే ప్రయోజనాలు ఇలా...

- వేసవిలో దుక్కులు దున్నడం వలన భూమి లో తేమను నింపుకునే శక్తి పెరుగుతుంది.
- భూమిలోని గడ్డి పొరలు విడిపోయి భూమి గుల్లబారుతుంది.
- సూక్ష్మజీవులు, వానపాములు పెరిగి సేంద్రియ ఎరువులు వృద్ధి చెందుతాయి.
- కలుపు మొక్కలు నశిస్తాయి.
- భూమి సారవంతమవుతుంది. ఎరువులు, పెస్టిసైడ్స్ తక్కువగా ఉపయోగించడంతో లాభాలు పొందే అవకాశం ఉంటుంది.
- పంటలను ఆశించే పురుగులు వేసవిలో నిద్రావస్థలో ఉంటాయి. దుక్కులు దున్నడంతో పురుగులు పైకి వచ్చి పక్షులకు ఆహారం కావడం లేదా ఎండకు చనిపోతాయి.
- శిలీంద్ర బీజాలు కూడా భూమి లోపల పొరల నుంచి బయటకు వస్తాయి.
- క్షారాలు, లవణాలు భూమి లోపలి పొరలకు చేరుకుని పైభాగం సరైన పీహెచ్‌లో ఉంటుంది.
- గత పంటకు సంబంధించిన మొక్కలు, వేళ్లు భూమిలో కుళ్లిపోయి ఎరువుగా మారుతాయి. ఎలుకల బెడద తగ్గిపోతుంది.
- వాలుకు అడ్డుగా దుక్కులు దున్నడం వలన నేల కోతకు గురి కాకుండా ఉంటుంది.
- వేసవిలో దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి నేలలోని నీటిని, పోషకాలను లాగేస్తాయి. పంట సమయానికి భూమిని నిస్సారంగా మారుస్తాయి. దుక్కులు దున్నడం వలన వీటి బెడద తగ్గుతుంది.
- ముందుగానే దుక్కులు దున్నడం వలన వానాకాలం పంటలు వేసుకునేందుకు మార్గం సుగమం అవుతుంది.
- వేసవిలో కురిసే అకాల వర్షాలను ఉపయోగించుకుని నేల తడిగా మారిన తర్వాత కనీసం 25 నుంచి 30 సెంటీమీటర్ల లోతుకు దున్నుకోవాలి. ఈ దుక్కుల కోసం ప్రత్యేకంగా రెక్క నాగలి, పల్లపు నాగలి ఉపయోగించాలి.
- యంత్రాలతో దున్నాలంటే డిస్క్ టిల్లర్, రోటవేటర్లు వినియోగించాలి.
- చెరువు మట్టి కలిపి దున్నుకోవడం, కంపోస్టుతో పాటు పచ్చిరొట్ట ఆకులు కలపడం వలన అవి మురిగి ఎరువుగా మారుతాయి.

పంటలకు మేలు



వేసవి దుక్కులు దున్నడం వలన భూసారం పెరిగి పంటలకు మేలు చేకూరుతుంది. దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి నేలలోని నీటిని, పోషకాలను లాగేసుకుని పంట సమయానికి భూమిని నిస్సారంగా మారుస్తాయి. ముందుగానే దుక్కులు దున్నడం వల్ల వానాకాలం పంట వేసుకునేందుకు అనువుగా ఉంటుంది.

– లావణ్య, ఇన్‌చార్జి ఏడీఏ,కోరుట్ల

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ ఆల్ఫోర్స్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక విద్య చాలా విలువైందని, భవిష్యత్‌కు పునాది వేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు రంజాన్ వేడుకలు

ధర్మపురి: మండలంలోని ఆరెపెల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తు రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు కీర్ పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బెజ్జంకి నితిన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్

సారంగాపూర్: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ. ఇబ్రహీం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోంద్ర రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మేడిపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీ చేపూరి నాగరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పేరును టీఆర్ఎస్‌గా మార్చాలి

సారంగాపూర్: బీఆర్ఎస్ పార్టీ పేరును తిరిగి టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) గా మార్చాలంటు బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు, సీనియర్ కార్యకర్త రామకిష్టు గంగాధర్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రానికి వచ్చిన కేసీఆర్‌కు విన్నవించారు.

కోత దశలోనే ఆర్‌పీఎం చూసుకోవాలి

మేడిపల్లి: వరి కోత కోసేటప్పుడే ఆర్‌పీఎం 18 నుంచి 19 ఉంచాలని హార్వేస్టర్ యజమానులకు వ్యవసాయ అధికారులు సూచించారు. బుధవారం వారితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. 19లోపు ఆర్‌పీఎం ఉంచితే రైతులకు తప్పా, తాలు ధాన్యంలో రావని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నరేందర్, సురేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

మల్యాల: మండల సర్వసభ్య సమావేశం బుధవారం కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించేందుకు సభ్యులకు సమాచారం ఇవ్వగా, సభ్యులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

రోడ్డుపైకి తలభాగం

రాయికల్: పట్టణంలోని శ్మశానవాటికలో దహనం చేసిన ఓ మృతదేహం కాలకుండానే తలభాగం రోడ్డుపైకి చేరింది. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. తలభాగం పూర్తిగా కాలక రోడ్డుపై కనిపించడంతో అందరూ భయపడ్డారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో ఇటీవల మేడిపెల్లి రాములు, గడ్డం రాజారెడ్డి మృతిచెందగా... బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నియోజకవర్గ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని బాధితులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రొక్కం హరీశ్‌రెడ్డి, నల్ల గంగాధర్, మిట్టపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పడాల భూమేశ్, జూపాక మహేశ్ ఉన్నారు.

పోలీసు కళాబృందం ప్రదర్శన

బుగ్గారం: మూఢ నమ్మకాలు ఆత్మహత్యలు రోడ్డు ప్రమాదాల నివారణ గల్ఫ్ ఏజెంట్ల మోసాలపై మండలం చిన్నాపూర్‌లో పోలీసు కళాబృందం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీదర్ మాట్లాడుతు సైబర్ నేరాలు విపరీతంగా పెరగుతున్నాయని నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సర్పంచ్ పోలీస్ కళాబృందం గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు ఆత్మీయ సన్మానం


పొన్నంను సన్మానిస్తున్న గౌడ నాయకులు

కోరుట్ల రూరల్: పట్టణానికి చెందిన వ్యాపారి, అష్టలక్ష్మీ ఆలయ చైర్మన్ బూరుగు రామస్వామి గౌడ్ ఇంటికి రాష్ట్ర రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం రాగా, స్థానిక గౌడ కులస్తులు మంత్రిని గజమాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ గౌడ్, పడాల నారాయణ,జిల్లా కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి పోతుగంటి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల ఆధ్వర్యంలో..

కొండగట్టు: కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం ముత్యంపేట గౌడ కులస్తులు కలిసి సత్కరించారు. అనంతరం ముత్యంపేటలో ఉన్న ఈత చెట్లకు నీటి సదుపాయం కల్పించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పంజాల మల్లేశంగౌడ్,కోల శ్రీనివాస్‌గౌడ్, వోల్లాల మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

రాయికల్: నిజామాబాద్ ఎంపీగా అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తానని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయికల్ మండలం అల్లీపూర్, రాయికల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చిందని, ప్రజలు ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో అత్తినేని గంగారెడ్డి, పోతు ప్రవళిక శ్రీనివాస్, ఓరుగంటిరాజవ్వ, అనిత, శ్రీహరి, బోగ నర్సయ్య, రాజన్న పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో పూజలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని కొమటికొండాపూర్ గ్రామంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం యామాపూర్‌లో కాంగ్రెస్ నాయకుడు కల్లెం గంగారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జైలేశ్, నాయకులు వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతోత్సవ కమిటీ నియామకం

ధర్మపురి: అంబేడ్కర్ జయంతోత్సవ నూతన కమిటీని పట్టణంలోని కర్నె అక్కపెల్లి కల్యాణ మండపంలో బుధవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చిలుముల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా దుర్గం రవీందర్, ఉపాధ్యక్షుడిగా మొలంగూరి రమేశ్, జంజిరికాని భరత్, సంయుక్త కార్యదర్శులుగా పసుల బుచ్చన్న, కుంటాల రాజమల్లయ్య, గౌరవ అధ్యక్షులుగా పారిపెల్లి రాజమల్లయ్య, రాగుల కాంతయ్య, ముఖ్య సలహాదారులుగా దుర్గం రాజన్న, కట్ట భువనేశ్వర్ తదితరులు నియమితులయ్యారు.

పట్టణ ప్లంబర్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: పట్టణ ప్లంబర్ యూనియన్ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆగ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సోమిడి మహేందర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తలారి శ్రీనివాస్, బడె పవన్, ప్రభుదాస్, హరీశ్, అయూబ్, బోయిని రాజు, గంగారాం పాల్గొన్నారు.

బీఎస్‌ఏ నేషనల్ సెలక్షన్ కమిటీ మెంబర్‌గా కాయితి శంకర్

రాయికల్: బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ అవార్డు సెలక్షన్ కమిటీ మెంబర్‌గా కాయితి శంకర్‌ను నియమిస్తూ ప్రెసిడెంట్ నల్ల రాధకృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కాయితి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ రంగాల్లో కృషి చేస్తున్న బహుజనులకు సమన్యాయం చేస్తామని పేర్కొన్నారు. తన నియమకానికి కృషి చేసిన రాధకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

రేచపల్లి గీత పారిశ్రామిక సంఘం ఎన్నిక

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో బుధవారం గీత పారిశ్రామిక సంఘం కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోతుగంటి లచ్చన్న, ఉపాధ్యక్షుడిగా బుర్ర చంద్రయ్య గౌడ్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు మోత్కూరి ప్రసాద్ గౌడ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కిసాన్‌కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ కో–ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి అన్నారు. మండలంలోని ముత్యంపేటలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం 100 రోజుల్లోనే హామీలన్ని అమలు చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అద్భుతమైన పురోగతిని సాధించేందుకు ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలుపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్కం జలంధర్‌రెడ్డి, కొమ్ముల సంతోష్‌రెడ్డి, కుక్కదువ్వ నర్సయ్య, తెలు నరేష్, అల్ల వినోద్, బొలిశెట్టి అశోక్, ఉదిగిరి మనోజ్, దామ అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి


ఇటిక్యాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, సిబ్బంది

రాయికల్: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో మధుసూదన్‌గౌడ్ సూచించారు. మండలంలోని కిష్టంపేట అల్లీపూర్, ఉప్పుమడుగు, అయోధ్య, కుమ్మరిపల్లి, రాయికల్, ఇటిక్యాల, రామాజీపేట, మైతాపూర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. అన్ని రకాల చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

మల్లాపూర్: గ్రామాల్లో ఉపాధిహామీలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాతారంలో ఉపాధిహామీ అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, లేని యెడల చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఈజీఎస్ ఏపీవో సతీష్, పంచాయతీ కార్యదర్శి వినోద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెగడపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 143 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 9 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి ప్రభుత్వం నుంచి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐవో శ్రీనివాస్, వైద్యాధికారులు నరేశ్, రమ, పర్హానా, అప్తాల్మిక్ అధికారి తిరుపతి, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, పాఠశాల ప్రత్యేక అధికారి సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

గొల్లపల్లి: గొల్లపల్లి, గోవిందుపల్లిలో ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నరేశ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నుంచి 12 ఏళ్ల లోపు 90 మంది పిల్లలకు అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. అయోడిన్ లోపం వలన తలెత్తే సమస్యలను పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్ వైజర్లు నరేందర్, రమేష్, శారధ, ఏఎన్‌ఎం రజిత పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

జగిత్యాలక్రైం: వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు రోడ్డుపై నడిపితే చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై సదాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోని చిన్నగట్టు అంజనేయ స్వామి ఆలయ సమీపంలో జగిత్యాల–గొల్లపల్లి ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలు వాహనాలను సీజ్ చేశారు. ప్రతివాహనదారుడు బండికి ఇన్సూరెన్స్‌తో పాటు లైసెన్స్ కలిగిన వ్యక్తే వాహనాలను నడపాలన్నారు.